ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం 25 జనవరి 2026 www.prajaswaramdailly.com 1 PM

# గ్రేడర్ వాహనం ఢీకొని కార్మికుడి మృతి

**భూపాలపల్లి, ప్రజాస్వరం**

భూపాలపల్లి సింగరేణి ఓపెన్ కాస్ట్ మైన్ లో గ్రేడర్ వాహనం ఢీకొని ఎస్వీ ఇంజనీరింగ్ కంపెనీ కార్మికుడు మృతిచెందాడు. ఓసీ–2 గనిలో సైట్ ఇన్ చార్జి గా సీ.హెచ్ శ్రీహరి పనిచేస్తున్నాడు. గత నెలలో వోల్వో వాహనం ఢీకొని ఎస్వీ కంపెనీకి చెందిన మరో కార్మికుడు మృతిచెందాడు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా ఎస్వీ కంపెనీ యాజమాన్యంపై చర్యలకు సింగరేణి వెనుకాడుతోంది. కార్మికుల రక్షణపై ఎస్వీ ఇంజనీరింగ్ కనస్ట్రక్షన్ కంపెనీ యాజమాన్యంనిర్లక్ష్యం వహిస్తున్నది.



# నాంపల్లిలో అగ్ని ప్రమాదం

## ఐదు మృతదేహాల గుర్తింపు

**హైదరాబాద్, ప్రజాస్వరం**

నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఫర్నిచర్ దుకాణంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భవనం సెల్లార్‌లో ఐదు మృతదేహాలను సిబ్బంది గుర్తించి బయటకు తీశారు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. భవనంలో చిక్కుకున్న మిగతావారి కోసం సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. సహాయక చర్యలను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి పరిశీలించారు. ఫర్నిచర్ దుకాణం ఉన్న భవనం సెల్లార్‌కు జేసీబీతో రంధ్రం చేసి పనులు చేపట్టారు.



### ప్రాణనష్టం లేకుండా కాపాడుకోవాలి

**రాజా సింగ్**




ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా ప్రాణనష్టం లేకుండా కాపాడుకోవాలి అనే దానిపై ఫైర్ సిబ్బందికి శిక్షణ అవసరం. ఫైర్ సిబ్బందిని విదేశాలకు పంపి శిక్షణ ఇప్పించాలి. 22 గంటలైనా ప్రమాదంలో చిక్కుకున్న ఆరుగురిని కాపాడలేకపోయారు. అందరూ ప్రాణాలతో ఉండాలని భగవంతుడిని కోరుకుంటున్నా.

### కొనసాగుతున్న రెస్క్యూ

నాంపల్లి ఫర్నీచర్ షాపులో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. రంధ్రం తవ్వి సెల్లార్ లోకి రెస్క్యూ బృందం వెళ్లింది. నాలుగు అయిదు మృతదేహాలను వెలికి తీసింది. ఉస్మానియా ఆసుపత్రికి మృతదేహాలను తరలించారు.

### మృతుల వివరాలు

వాచ్‌మెన్ బేబీ (43), అఖిల్ (12), ప్రణీత్ (9), మహ్మద్ ఇంతియాజ్ (27), హబీబ్ (40)





### బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

**మంత్రి పొన్నం ప్రభాకర్**



నాంపల్లి అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రమాద ఘటనను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ప్రకటించారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించి నిబంధనలు పాటించకుండా ఘటనకు కారణమైన షాపు యజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు జరగకుండా జీహెచ్ఎంసీ, పోలీస్, రెవెన్యూ, హైడ్రా అధికారులు సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని పొన్నం తెలిపారు.



# ఈ ఏడాదీ బొగ్గు దిగుమతి తగ్గిస్తాం : కిషన్ రెడ్డి

**కొత్తగూడెం, ప్రజాస్వరం**

కొత్తగూడెం పద్మావతీ ఖని 5వ ఇంక్లైన్ లో సింగరేణి కార్మికులతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం సింగరేణి పరిస్థితి బాగోలేదని, లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న సింగరేణిని కాపాడుకోవాలన్నారు. దేశంలో బొగ్గు ద్వారా 74 శాతం విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. జీవో శాతం ప్రమాదాలు లేని బొగ్గు ఉత్పత్తే లక్ష్యం అని అన్నారు. సింగరేణిలో దుబారా ఖర్చు తగ్గించాలని అన్నారు. నాణ్యతతో కూడిన ఉత్పత్తి పెంచాలన్నారు. ఢిల్లీ బోర్డు మీటింగ్ లో చర్చించుకోవడం కాదు, కార్మికులకు ప్రతి విషయం తెలియాలని అన్నారు. ఈ ఏడాది కూడా బొగ్గు దిగుమతి తగ్గిస్తామని కిషన్ రెడ్డి తెలిపారు.



# పరేడ్ రిహార్సల్స్ పరిశీలించిన అదనపు ఎస్పీ

మెదక్ జనవరి 25 (ప్రజా స్వరం)

గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్ లో పరేడ్ రిహార్సల్స్ నిర్వహించారు. ఈ రిహార్సల్స్ ను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. పరేడ్ లో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ తో పాల్గొన్నారు. కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు, భద్రతా ఏర్పాట్ల పై ఆయన మార్గదర్శకాలు అందించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, రంగా నాయక్, సీఐ జార్జ్, ఆర్ ఐ శైలేందర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సైట్ విజిట్ నిబంధన పెట్టిన అన్ని టెండర్లూ రద్దు చేయాలి

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



హైదరాబాద్, ప్రజాస్వరం

నైనీ కోల్ బ్లాక్ ఒక్కటే కాదు.. పారదర్శకత, నిజాయతీ ఉంటే సైట్ విజిట్ నిబంధన పెట్టిన అన్ని టెండర్లూ రద్దు చేయాలి. 2025 మే నుంచి ఎన్ని టెండర్లు పిలిచారు.. ఎంతమందికి సర్టిఫికెట్ ఇచ్చారో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి అని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన 40 ఏళ్ల అనుభవాన్ని ఉపయోగించి సీఎం రేవంత్ ను బొగ్గు కుంభకోణం నుంచి బయటపడేసేందుకు యత్నించారని విమర్శించారు. ఈ స్కామ్ ను బయటపెట్టిన తమ పార్టీపై బురద జల్లుతున్నారన్నారు. తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడారు. “2025 మేలో సైట్ సర్టిఫికెట్ నిబంధన వచ్చింది. దీని తొలి లబ్ధిదారు సీఎం బంధువు, శోధా కన్ స్ట్రక్షన్ యజమాని సృజన్ రెడ్డి. ఆ తర్వాత అన్ని టెండర్లకు సైట్ విజిట్ నిబంధన పెట్టారు. ప్రతి టెండర్ కు ప్లస్ టెన్ పద్ధతి ఫాలో అయ్యారు. స్కామ్ లు జరగలేదని నమ్మించేందుకు భట్టి విక్రమార్క ప్రయత్నిస్తున్నారు. నా వద్ద ఫొటోలు, వీడియోలు, మెయిల్స్ ఉన్నాయి. విచారణకు ఆదేశిస్తే ఆధారాలు ఇస్తా. సమయం వచ్చినప్పుడు అవన్నీ బయటపెడతా” అని హరీశ్ రావు అన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ లో ఫర్నీచర్

**ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ మాన్**




**హైదరాబాద్, ప్రజాస్వరం**

నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ లో ఫర్నీచర్ పెట్టడం ప్రమాద తీవ్రతను పెంచింది. ఫర్నీచర్ తో పాటు కెమికల్స్ ను సెల్లార్ లో పెట్టారు . ఫైర్ డిపార్ట్ మెంట్ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. షార్ట్ సర్క్యూట్ కావచ్చు, సిగరెట్ ద్వారా కూడా ప్రమాదం జరిగి ఉండవచ్చు. షాపు యజమాని సతీష్ పై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం అని ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ మాన్ తెలిపారు.

# హైదరాబాద్ నిమ్స్‌కు సౌమ్య తరలింపు

**హైదరాబాద్, నిజామాబాద్, ప్రజాస్వరం**



గంజాయి ముఠా దాడిలో గాయపడ్డ కానిస్టేబుల్ పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ కు సౌమ్య తరలించారు.

ఓ మైనర్ ను పోలీసులుఅదుపులోకి తీసుకున్నారు. ముఠా సభ్యులు మతిన్, రహీద్, అఫ్రోజ్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నది. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దాడి ఘటనపై విచారణ కమిటీ ఏర్పాటయ్యింది. కమిటీ నివేదిక ఆధారంగా కఠిన చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవ ర్యాలీ

**చిన్న శంకరం పేట, జనవరి 25 ( ప్రజాస్వరం )**

ఓటు హక్కును వినియోగించుకోవడం ఒక హక్కు మాత్రమే కాదని దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి ఓటుకు ఉన్నదని ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీలార్ మాలతి అన్నారు, చిన్న శంకరంపేట మండల కేంద్రంలో తహశీల్దార్ మాలతి ఆధ్వర్యంలో 16వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి మెదక్ చేగుంట రహదారి గుండా స్థానిక బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు, జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని కార్యాలయం ముందు ముగ్గుల పోటీ నిర్వహించారు ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు, అదేవిధంగా నలుగురు సీనియర్ సిటిజన్లను గుర్తించి శాలువాలతో సన్మానం చేశారు, ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు



జాతీయ ఓటర్ దినోత్సవ పెన్నులను తహశీలార్ మాలతి చేతుల మీదుగా అందజేశారు, ఈ సందర్భంగా తహశీలార్ మాలతి మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎలాంటి ప్రలోభాల గురికాకుండా భయభ్రాంతులకు గురి కాకుండా తప్పకుండా తమ ఓటును వినియోగించుకోవాలని, నోట్ల కోసమో లిక్కర్ కోసమో ఓట్లను అమ్ముకోకూడదని ఆమె ఓటర్లకు సూచించారు, ఈ కార్యక్రమంలో తహశీలార్ మాలతి రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు, జూనియర్ అసిస్టెంట్ శేషు, మధు, జిపిఓ లు ఎల్లము, మహేష్, రాజు, కవిత, గీత, బి ఎల్ ఓ లు నాగరాణి, మాలతి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.